క్లుప్తంగా

సామాజికవేత్తకు డాక్టరేట్



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక వేత్త సయ్యద్ మాసుమ్ మొహియొద్దీన్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. శనివారం పాండిచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు మాసుమ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1988లో స్కౌట్ గైడ్స్ విద్యార్థిగా సమాజ సేవను ప్రారంభించి, నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

ఉపాధ్యాయుడికి..



ఎ.ప్రవీణ్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు ఎ.ప్రవీణ్‌కుమార్‌గౌడ్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని హిందీ విభాగంలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈయన 'మిథిలేశ్వర్ కా సమగ్ర సాహిత్య–ఏక్ అనశీలన్' అంశంపై జరిపిన పరిశోధనకుగాను యూనివర్సిటీ అధికారులు ఈ పట్టా ప్రదానం చేశారు. కాగా, ప్రవీణ్‌కుమార్‌గౌడ్ ప్రస్తుతం నవాబుపేట మండలం లింగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ–హిందీ) గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆదివారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ధర్నాను జయప్రదం చేయండి

జడ్చర్ల టౌన్: రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం జడ్చర్ల సిగ్నల్‌గడ్డ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు హిందూ సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. ధర్నాలో హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్నేహితుల ఔదార్యం



మిడ్జిల్/దేవరకద్ర రూరల్: మిడ్జిల్ మండలం వాడ్యాల్‌కు చెందిన బొర్ర కృష్ణయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు (1991–1992 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్) ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ. 50వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా దేవరకద్ర మండలం నార్లోనికుంటకు చెందిన రాజమోని రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న దేవరకద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు అతడిని పరామర్శించి, వైద్యఖర్చుల నిమిత్తం రూ. 35వేలను అందజేశారు. కార్యక్రమంలో శేఖర్, ప్రతాప్‌రెడ్డి, విజయ్‌కుమార్, శంకర్, ఉస్మాన్, జనార్దన్, నరేంద్రమూర్తి, ఖలీల్, లక్ష్మయ్య, బుచ్చిరెడ్డి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

దేవరకద్ర: మండలంలోని గోపన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వడ్డె శ్రీను మృతిచెందగా.. ఆదివారం జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట జవహర్, రాజుగౌడ్, వెంకట్, రాములు, రాంబాబు, పకీరన్న, శ్రీకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బుచ్చన్న, ప్రసాద్ ఉన్నారు.

సభ్యత్వ నమోదు పెరగాలి

పాలమూరు/భూత్పూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలం పెరగాలంటే, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లిలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న దుకాణదారులతో పాటు ఇంటింటికి తిరిగి సభ్యత్వం అందజేశారు. అదేవిధంగా భూత్పూర్ చౌరస్తాలో వ్యాపారులకు సభ్యత్వం అందజేశారు. కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, రమేష్, విజయ్‌కుమార్‌గౌడ్, కాటం నాగరాజు, హరికృష్ణ, రాంరెడ్డి, సత్తయ్యగౌడ్, పాండురెడ్డి, రవీందర్‌రెడ్డి, గాల్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఎండీ ఫారూఖ్, నరేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.



'రైతుభరోసా' ఎగ్గొట్టిన కాంగ్రెస్

- జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన



మహబూబ్‌నగర్ మండలం కోడూర్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: వానాకాలం పంటకు రైతుభరోసా ఇచ్చేదిలేదని తేల్చిచెప్పి.. కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి నిరూపించారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ మండిపడ్డారు. వానాకాలం పంటలకు రైతుభరోసా నిధులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ మండలం కోడూర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం గోస తీయిస్తుందని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణమాఫీ చేయడంతో పాటు వానాకాలం పంటలకు రైతుభరోసా నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుధాశ్రీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు, మాజీ కోఆప్షన్ సభ్యుడు అల్లావుద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాడం ఆంజనేయులు, మాజీ సర్పంచులు బి.శ్రీకాంత్‌గౌడ్, యుగంధర్‌రెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

⇨ జడ్చర్ల సిగ్నల్‌గడ్డలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ధర్నా విరమణ అనంతరం పోలీసుల కళ్లుగప్పి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ ధర్నాకు మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో కోడ్గల్ యాదయ్య, రఘుపతిరెడ్డి, సుదర్శన్‌గౌడ్, పి.మురళి, ప్రణీల్‌చందర్, రామ్మోహన్, హఫీజ్, బుక్క మహేష్, శ్రీశైలంయాదవ్, నాగిరెడ్డి, లత, ఇంతియాజ్ పాల్గొన్నారు.

⇨ దేవరకద్ర పాత బస్టాండ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గంటపాటు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, కొండారెడ్డి, బాల్‌రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, వెంకటయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

⇨ ఉమ్మడి గండీడ్ మండల బీఆర్‌ఎస్ నాయకులు నంచర్ల గేట్ వద్ద ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించి నట్టేట ముంచిందని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వెంకట్రాంరెడ్డి, గోపాల్, జంగాళ్ల వెంకటయ్య, నీలేష్, రాంచంద్రారెడ్డి, రఘు, కిష్టయ్య, రవి పాల్గొన్నారు.

⇨ నవాబుపేటలో బీఆర్‌ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్‌గౌడ్, శ్రీనివాసులు, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్, థాహేర్, చందర్‌నాయక్, సంజీవరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

⇨ చిన్నచింతకుంట మండలంలోని పర్దీపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోట రాము, స్వామి, శ్రీనివాస్‌గౌడ్, మైబు, ఎర్రన్న, రాఘవులు, పాషా, మల్లప్ప, చిన్న సంజన్న పాల్గొన్నారు.

⇨ కోయిల్‌కొండ వివేకానంద చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, భీంరెడ్డి, మాదవులు పాల్గొన్నారు.

⇨ హన్వాడ మండల కేంద్రంలోని తాండూర్ ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గంటపాటు ధర్నా చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ధర్నాలో మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, లక్ష్మయ్య, నరేందర్, బసిరెడ్డి, చెన్నయ్య, పెద్ద చెన్నయ్య పాల్గొన్నారు.

⇨ మిడ్జిల్ మండల కేంద్రంలోని జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతుభరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాండుయాదవ్, బాల్‌రెడ్డి, బాలు, జంగారెడ్డి, కాడయ్య, బంగారు, నవీన్, భీంరాజ్ పాల్గొన్నారు.



జడ్చర్లలో..



దేవరకద్రలో..



చిన్నచింతకుంట మండలం పర్దీపూర్‌లో..

విలీన గ్రామాలకు ప్రత్యేక నిధులు



బండమీదిపల్లిలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విలీన గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం 13వ వార్డు పరిధిలోని బండమీదిపల్లిలో పర్యటించారు. కాగా, వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక నిధులతో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికులు యాదగిరిగౌడ్, శ్రీనివాసులు, డీలర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల ముడా చైర్మన్‌గా నియమితులైన కె.లక్ష్మణ్ యాదవ్, 37వ వార్డు కౌన్సిలర్ కె.స్వప్న దంపతులను సద్దలగుండులోని వారి నివాసంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కలాం భారత్ పురస్కారం ప్రదానం



అవార్డు అందుకుంటున్న ఆనంద్‌కుమార్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌కు చెందిన శ్రీలక్ష్మీ నారాయణ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మణి ఆనంద్‌కుమార్‌కు ఏపీజే అబ్దుల్ కలాం భారత్ విభూషణ్ పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రగతి ఫౌండేషన్, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరాజు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు ఆనంద్‌కుమార్ తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలకుగాను పురస్కారం ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు.

మైసమ్మ చెంత భక్తజన జాతర



నవాబుపేట: పర్వతాపూర్ మైసమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి, అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. మైసమ్మకు ప్రత్యేక పూజల అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని వేడుకున్నారు. అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.

సంతలో అన్నదానం



నవాబుపేట: మండల కేంద్రంలో జరిగే వారాంతపు సంతకు వివిధ గ్రామాల రైతులు, ప్రజలు వస్తుంటారు. వారి సౌకర్యార్థం రెండు నెలలుగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి ఉచితంగా భోజనం అందిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం జరిగిన సంతలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకు 3వేల మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు.

అమరుల త్యాగాలను స్మరించుకోవాలి : ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమర వీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఎస్పీ డి.జానకి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు అమరులను స్మరించుకుంటూ, పోలీస్ ఫ్లాగ్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు పోలీస్ పరేడ్ మైదానంలో పోలీసు కవాతుతో పాటు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పరేడ్ మైదానం నుంచి వన్‌టౌన్ చౌరస్తా వరకు పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

నియామకం

పాలమూరు: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సద్దలగుండుకు చెందిన షబ్బీర్‌ను నియమిస్తూ ఆదివారం డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, డీసీసీ మైనార్టీ చైర్మన్ మహ్మద్ ఫయాజ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



భూత్పూర్: కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాడుతుందని పార్టీ జిల్లా నాయకుడు కిల్లె గోపాల్ అన్నారు. ఆదివారం భూత్పూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారుల సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు ముందుండి పోరాటాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కర్వెన రిజర్వాయర్ పనులు త్వరగా పూర్తిచేసి, రైతులకు సాగునీరు అందించాలని, రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం కార్యదర్శి శ్రీశైలం, బాలరాజు, వెంకట్రాములు ఉన్నారు.

బీసీ కుల సంఘాల కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా కేంద్రంలోని బోయపల్లిలో బీసీ కుల సంఘాల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమ్మర, వడ్ల, కుమ్మర, చాకలి, మంగళి, ముదిరాజ్, యాదవ, గౌడ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల సంఘాల అధ్యక్షుడిగా వాస సత్యం, ప్రధాన కార్యదర్శిగా జనసీల యాదగిరి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, కోశాధికారిగా భగవాన్, న్యాయ సలహాదారుడిగా వినోద్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా పి.యాదయ్య, బాలరాజుగౌడ్, రవికుమార్‌చారి, జుర్రు సత్యం, వెంకటయ్య, విజయ్‌కుమార్, వీరాచారి, గోవర్ధన్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఓన్ ప్లేట్ వాహనాల వినియోగంపై చర్యలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులు ఓన్ ప్లేట్ వాహనాలను వినియోగిస్తుండటంతో తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందిస్తూ.. ఓన్ ప్లేట్ వాహనాల వినియోగంపై వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డీఆర్డీఓ, సహకార బ్యాంకు, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, పౌరసరఫరాల శాఖ, ఎక్సైజ్ శాఖలకు సర్క్యులర్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఓన్ ప్లేట్ వాహనాల వినియోగంతో తమకు ఉపాధి లేకుండాపోతుందని కలెక్టర్‌కు విన్నవించగా.. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవాలు



రుద్రహోమం నిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: మండలంలోని దుందుభీ నదీ తీరాన ఉన్న మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయంలో ఆదివారం అగ్నిగుండ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు ప్రాతఃకాల పూజలు చేశారు. 9 గంటలకు స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చనల అనంతరం మంగళహారతి సమర్పించారు. 10 గంటలకు రుద్రహోమం నిర్వహించి, మహా మంగళ హారతులను నివేదించారు. సాయంత్రం అగ్నిగుండ స్థలపూజ చేసి సమిధలు పేర్చారు. అనంతరం గణపతిపూజతో పాటు భక్తుల శివనామస్మరణ మధ్య వీరభద్రస్వామికి రుద్రాభిషేకం చేశారు. సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండ మహోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి – అల్వాల్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



కరాటే విద్యార్థులతో మాస్టర్ ఎస్‌కే మోసీన్

మహబూబ్‌నగర్ క్రీడలు: సంగారెడ్డిలో వచ్చేనెల 2 నుంచి నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన డ్రాగన్ షోటోకాన్ విద్యార్థులు ఎంపికైనట్లు సీనియర్ కరాటే మాస్టర్ ఎస్‌కే మోసీన్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపికల్లో అండర్–14 విభాగం 42 కిలోల వెయిట్ కేటగిరీలో పఠాన్ ఫలక్, 46 కిలోల కేటగిరీలో షాఫియ తస్లిం, అండర్–17 విభాగం 60 కిలోల కేటగిరీలో ఆయేషా తస్లిం ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఆదివారం విద్యార్థులను స్థానిక ఎంవీఎస్ మైదానంలో కరాటే మాస్టర్ మోసీన్ శాలువాలతో సత్కరించారు. డ్రాగన్ షోటోకాన్ కరాటే దూ స్పోర్ట్స్ ఫౌండర్ సొలంబిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, కరాటే మాస్టర్ మోసీన్ అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

దైవ సేవకులను ఘనపర్చాలి



పాస్టర్ పరంజ్యోతిని సన్మానిస్తున్న సంఘ పెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవుడి మాటలను పూర్ణ హృదయంతో అందించి, సంఘ సంక్షేమాభివృద్ధికి పాటుపడే దైవసేవకులను ప్రతి ఒక్కరూ ఘనపర్చాలని రెమా వర్షిప్ సెంటర్ డైరెక్టర్ పాస్టర్ బీఎస్ పరంజ్యోతి పిలుపునిచ్చారు. పాస్టర్స్ అప్రిసియేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రెమా చర్చిలో పాస్టర్ పరంజ్యోతిని సంఘ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవుడు, ప్రజలకు మధ్య ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న సేవకులను ఘనపరిచేందుకే ప్రపంచవ్యాప్తంగా పాస్టర్స్ అప్రిసియేషన్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వాసులంతా కాపరుల మాటలను జాగ్రత్తగా గ్రహించి.. దేవుడికి ఇష్టులుగా, పరలోకరాజ్య వారసులుగా ఉండేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ పెద్దలు దేవయ్య, శ్యాంసుందర్, ప్రసన్నకుమార్, రామాంజనేయులు, కృష్ణ పాల్గొన్నారు.

31న ఫెయిత్ అండ్ లైఫ్ విక్టరీ కాన్ఫరెన్స్

స్థానిక సంఘాల సహకారంతో ఈ నెల 31న అప్పన్నపల్లి వైట్ హౌస్ కన్వెన్షన్ హాల్‌లో ఫెయిత్ అండ్ లైఫ్ విక్టరీ దేశవ్యాప్త కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు పాస్టర్స్ బీఎస్ పరంజ్యోతి, ఎన్.యేసుపాదం, కె.విలియం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కాన్ఫరెన్స్‌కు ముఖ్య అతిథులుగా అంతర్జాతీయ ప్రసంగీకులు బిషప్ బెంజిమిన్ సి కొమనపల్లి, జూనియర్ బెంజిమెన్, డా. అర్పిత, బ్రదర్ రెయిన్‌హార్ట్ హాజరై శక్తింతమైన దేవుడి వ్యాఖ్యాన్ని అందించనున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని సేవకులు, విశ్వాసులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్సీకి వినతి

నారాయణపేట రూరల్: కేజీబీవీ టీచర్లకు ప్రభుత్వం మినీమం టైం స్కేల్ అమలుచేసే విధంగా కృషి చేయాలని కోరుతూ ఆదివారం తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి, నర్సింహ హైదరాబాద్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కేజీబీవీ టీచర్లతో పాటు ఎస్ఎస్ఏ ఉద్యోగులను సైతం పార్ట్‌టైం ఉద్యోగుల నుంచి పూర్తి సమయం ఉద్యోగులుగా గుర్తించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.